## క్లుప్తంగా

### కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన అవసరం



కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ఇస్తున్న రీసోర్స్‌పర్సన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆధునిక సమాజాన్ని కంప్యూటర్లు శాసిస్తున్నాయని, విద్యార్థి దశ నుంచే కంప్యూటర్లపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని రీసోర్స్‌పర్సన్ ఏవీ రాజేష్ సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం ఆయన విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు కె.శ్యామ్ సుందర్ గణితంలో సంక్షిప్త, అంక గణితాలను క్లుప్తంగా వివరించారు. బ్యాంక్ ఉద్యోగి ఫణీంద్ర సాయి కుమార్ విద్యార్థుల్లో మేథోశక్తిని పెంపొందించేందుకు జనరల్ నాలెడ్జిపై క్విజ్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకుడు ఎ.నారాయణ రావు, గ్రంథాలయ సిబ్బంది వీటీ సందీప్ కుమార్, ఎం. శ్యామల బాబు, ఎండీ అస్లాంపాషా, బీవీఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### వీరేశలింగం సేవలు వెలకట్టలేనివి

ఏలూరు రూరల్: సమాజంలో దురాచారాలను రూపుమాపుడానికి కందుకూరి వీరేశలింగం పంతులు అలుపెరగని పోరాటం చేసారని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. శనివారం స్థానిక పవర్‌పేటలోని సీపీఎం కార్యాలయంలో వీరేశలింగం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వీరేసలింగం మూఢ విశ్వాసాలు, సమాజంలో దురాచారాలపై ప్రజలను చైతన్యం చేశారని చెప్పారు. మతమనే ముసుగులో అథోగతి పాలైన హైందవ సమాజంలో విప్లవాన్ని రగించాలరని కొనియాడారు. జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహరావు, బి.సోమయ్య, ఎ.శ్యామలారాణి, పి.రామకృష్ణ, లెనిన్, కట్టా సత్యనారాయణ, గోపీ, త్రినాథ్, సత్యం తదితరులు విరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

- మూడు లేఅవుట్లలో వేగంగా పనులు
- ఏలూరులో 17 వేల నిర్మాణానికి చర్యలు
- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాని





క్యాంపు కార్యాలయంలో హౌసింగ్‌పై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో కమిషనర్ వెంకటకృష్ణ, సమీక్షకు హాజరైన అధికారులు

ఏలూరు టౌన్: పేదలకు సొంతిల్లు ఎంతో విలువైందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయటమే మనముందున్న ప్రధాన లక్ష్యమని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆయన ఏలూరు నియోజకవర్గంలో పేదల ఇళ్ల నిర్మాణాలపై గృహనిర్మాణ, మెప్మా, నగరపాలక సంస్థ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులు, సచివాలయ ఎమినిటీ సెక్రటరీలతో ప్రత్యేకంగా సమీక్షించారు.

**15 రోజులకోసారి తనిఖీ**

పోణంగి, కొమడవోలు, చొదిమెళ్లలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఆరా తీశారు. ప్రతి 15రోజులకోసారి అవసరమైతే క్షేత్రస్థాయిలో పనితీరుపై ఆకస్మిక తనిఖీలు చేస్తానని ఎమ్మెల్యే నాని చెప్పారు. మూడు లేఅవుట్లలోనూ లబ్ధిదారులు బ్యాంకు రుణం పొందేలా స్వయం సహాయక సంఘాల్లో (ఎస్‌హెచ్‌జీ) సభ్యులుగా చేర్పించి, గ్రూపులుగా ఏర్పాటు చేయాలని, ఇంటి నిర్మాణానికి అదనంగా రూ.35 వేలు బ్యాంకు రుణం మంజూరుకు లబ్ధిదారులతో ఐసీఐసీఐ బ్యాంకులో ఖాతా తెరిపించాలని ఏలూరు కార్పొరేషన్ పీఓ కృష్ణమూర్తిని ఆదేశించారు. లబ్ధిదారుల్లో ఎవరైనా డ్వాక్రా సంఘాల్లో లేకుంటే వారిని గ్రూపులుగా చేసేలా చర్యలు తీసుకోవాలని మెప్మా పీడీ ఇమ్మానుయేలు, సిబ్బందికి నాని సూచించారు.

**ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

ఏలూరు నియోజకవర్గంలో మొదటి ఫేజ్‌లో సుమారుగా 17 వేల ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని, ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా చేసేలా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే నాని సూచించారు. పోణంగి జగనన్న లేఅవుట్‌లో 7,035 ఇళ్ల పట్టాలు పంపిణీ చేయగా మొదటి ఫేజ్‌లో 5,572 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నామని, ఇళ్ల నిర్మాణంలో ఏర్పడిన ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కొమడవోలు జగనన్న లేఅవుట్‌లో 9,984 పట్టాలకు తొలిదశలో 7,241 ఇళ్ల నిర్మాణానికి, చొదిమెళ్ల జగనన్న ఇళ్ల కాలనీ లేఅవుట్‌లో 7,017 పట్టాలకు మొదటి దశలో 4,550 ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లకు అప్పగించామని తెలిపారు. వైఎస్సార్ జగనన్న ఇళ్ల కాలనీల్లోని లేఅవుట్లలో పర్యవేక్షణకు నియమించిన సచివాలయ ఎమినిటీస్‌లపై ఒత్తిడి లేకుండా నాణ్యమైన రీతిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాని అన్నారు. మూడు లేఅవుట్లకు ముగ్గురు ఏఈలను ఇన్‌చార్జీలుగా నియమించాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్‌ను ఆదేశించారు. వెయ్యి ఇళ్లకు ఒక ఎమినిటీ సెక్రటరీ ఉండాలని, లేఅవుట్‌లోనే వారికి పని చేసేలా సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ సమీక్షలో నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, హౌసింగ్ పీడీ పి.వేణుగోపాల్, మెప్మా పీడీ ఇమ్మానుయేల్, తహసీల్దార్ సోమశేఖర్, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్‌కుమార్, ఇళ్ల నిర్మాణ కంట్రాక్టర్లు, సచివాలయ ఎమినిటీ సెక్రటరీలు ఉన్నారు.

### అంబేడ్కర్ ఆశయ సాధకుడు సీఎం జగన్

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అంబేడ్కర్ ఆశయాల సాధన దిశగా సాగుతోందని నవ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఊదరగొండి చంద్రమౌళి శుక్రవారం ఓ ప్రకటనలో కొనియాడారు. అగ్రకులాల్లో నిరుపేదలను సైతం సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని తెలిపారు. సీఎం జగన్ పాలనకు తమ పార్టీ మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యారంగం బలోపేతానికి అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన అందిస్తూ లక్షలాది మంది యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించారని కీర్తించారు. రైతులకు రుణాలు అందించి, గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, యంత్రాలు అందించి వ్యవసాయ రంగానికి కొత్త పుంతలు తొక్కిస్తున్నారని తెలిపారు. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ గొప్ప పాలన అందిస్తోన్న ముఖ్యమంత్రికి అన్ని వర్గాల వారు అండగా నిలవాలని కోరారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, టీడీపీ నాయకులు చేస్తోన్న అసత్య ప్రచారానికి రానున్న ఎన్నికల్లో ప్రజలే జవాబు చెబుతారని ఆకాంక్షించారు.

# శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు



ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, వేసవి సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు అలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, తూర్పురాజ గోపుర ప్రాంతాలతో పాటు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ అనివేటి మండపంలో తిరుమల తిరుపతి దాససాహిత్యా ప్రాజెక్టుకు చెందిన పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా దేవస్థానం అధికారులు, సిబ్బంది వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

## రేపు గోవిందానంద సరస్వతి స్వామీజీ రాక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ద్వారక, బదరి పీఠాధిపతి స్వరూపానంద సరస్వతి స్వామీజీ శిష్యులు గోవిందానంద సరస్వతి స్వామీజీ ఈనెల 29న ఏలూరు నగరానికి విచ్చేయనున్నారని కంచికామకోటి హేలాపురి సంస్కృతవేద స్మార్త ప్రయోగ పాఠశాల అధ్యక్షుడు ఈదర వేంకట రమణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు నగరంలోని పవర్‌పేట చదలవాడ వారి వీధిలో ఉన్న సంస్కృత పాఠశాలకు స్వామీజీ విచ్చేస్తారని, ఉదయం 11 గంటలకు భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం ఇక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లిగూడెంకు పయనమౌతారని తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులంతా పాల్గొని స్వామీజీ అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

# నయవంచకుడు చంద్రబాబు

- దేశంలోనే ధనిక రాజకీయవేత్త
- సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ శ్రీలక్ష్మి



ఏలూరు టౌన్: మహానాడు అంతా ఆత్మస్తుతి.. పరనిందతోనే సాగుతోందని.. ప్రతిపక్షనేత చంద్రబాబు తన గొప్పలు చెప్పుకోవడం తప్ప, వేరే ప్రయోజనం ఏమి లేదని.. దేశంలోనే అత్యంత ధనిక రాజకీయవేత్తగా ఉంటూ ఇతరులపై బురదచల్లటం చంద్రబాబుకు అలవాటుగా మారిందని రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి విమర్శించారు. ఏలూరులో ఆమె మాట్లాడుతూ రాజమండ్రిలో టీడీపీ మహానాడు వేదికగా చంద్రబాబు ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క అంశంపైనా మాట్లాడే పరిస్థితి లేదన్నారు. సైకిల్‌కు కరెంటు పెట్టానని, ఇక దూసుకుపోతానంటూ చెప్పడం విడ్డూరంగా ఉందని, సైకిల్‌కి కరెంట్ పెడితే ఏమవుతుందో చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్నించారు. చంద్రబాబు కుటుంబ సభ్యుల ఆస్తి రూ.వెయ్యి కోట్లకు పైబడి ఉందని, ఆయన ఎన్నికల డిక్లరేషన్, ఐటీ రిటర్న్స్ లెక్కలు అధికారికంగా ధ్రువీకరిస్తున్నాయని పేర్కొన్నారు. చంద్రబాబు భార్య, కొడుకు, కోడలు, మనవడు పేర్లతో వందల కోట్ల ఆస్తుంలుంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తుంటాడని, ఇతరులపై బురద చల్లటం చంద్రబాబుకు తగదని హితవుపలికారు. చంద్రబాబుకు ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మ ఇచ్చిన ఆస్తి ఎంత.? కేవలం రెండు ఎకరాల ఆస్తితో జీవితాన్ని ప్రారంభించి ఇప్పుడు వెయ్యి కోట్లకు పైగా ఆస్తిని సంపాదించిన చంద్రబాబు నిఖార్సైన రాజకీయ నాయకుడా అని ప్రశ్నించారు. నేడు మహానాడు వేదికగా ప్రజలను మరోసారి మోసం చేసేందుకు అబద్ధపు మాటలు, హామీలు ఇస్తున్నారని, బాబు పేరు చెబితేనే జనం మోసానికి కేరాఫ్ అడ్రస్‌గా భావిస్తున్నారని పేర్కొన్నారు. 14 ఏళ్ల సీఎంగా పనిచేసి కనీసం నాది అనే చెప్పుకునే ఒక్క పథకాన్ని ప్రజలకు చెప్పుకోగలవా చంద్రబాబు అని ప్రశ్నించారు. 1996 నుంచి 2004 వరకు మళ్లీ 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాష్ట్రంలో ఎంత మంది పేదలను కోటీశ్వరులను చేశారో చూపించాలని నిలదీశారు. చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించే గత ఎన్నికల్లో చావుదెబ్బ కొట్టారని, మరోసారి అడ్రస్ లేకుండా చేస్తానని దీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో ప్రజలు సంతోషంగా ఉండాలని, నాలుగేళ్లపాలనలో నాదీ అని చెప్పుకునే అనేక పథకాలను జగనన్న చేసి చూపారని వివరించారు.

# రమాబాయి సేవలు మరువలేనివి



మాత రమాబాయికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమని మాత రమాబాయి సేవలు మరువలేనివని మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం ఏలూరులో మాత రమాబాయి 85 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఉన్నత చదువుల కోసం రమాబాయి ఎంతో కృషి చేసిందని గుర్తుచేశారు. ముగ్గురు పిల్లలను పెంచుతూ దేశం కోసం రమాబాయి భర్తను ఉన్నత చదువుల కోసం విదేశాలకు పంపించారని వివరించారు. నేడు దేశంలో మహిళలు విద్యావంతులై, ఉన్నతంగా జీవించడానికి రమాబాయి చేసిన కృషి ఎంతో ఉందని చెప్పారు. భర్త విజయంలో కీలకభూమిక వహించిన రమాబాయి మహిళల్లో స్ఫూర్తి నింపారని కొనియాడారు. తొలుత పారబండ బాబురావు, డేవిడ్, ఏసు నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### నేటి నుంచి కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతున్న శ్రీకుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 28 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. 28న ఉదయం 9.30 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్విగ్వరణ, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, అంకురార్పణ, అలాగే 29న ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ, సర్వతోభద్ర మండలి ఆరాధన, మూల మంత్ర అనుష్ఠానము, హోమాలు జరుగుతాయన్నారు. ఆఖరి రోజైన 30న ఉదయం 8 గంటల నుంచి మూలవరుల ఉత్సవమూర్తులకు నవకలశ స్నపన, శ్రీ చక్రార్చన, సప్తశతి పారాయణ, హోమాలు, పూర్ణాహుతితో ఈ వేడుకలు పరిసమాప్తం అవుతాయన్నారు. భక్తులు వేడుకల్లో పాల్గొని, అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఈఓ కోరారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 20 | అరటి కాయ (1) | 05-07 |
| వంకాయలు (గులాబీ) | 28 | చిక్కుడు కాయలు | 70 |
| వంకాయలు (కాంతులు) | 28 | చామదుంపలు | 48 |
| వంకాయలు (తెలుపు) | 28 | ములక్కాడలు | 05-08 |
| బెండకాయలు | 16 | కంద | 56 |
| పచ్చిమిర్చి | 44 | బీట్‌రూట్ | 34 |
| కాకర కాయలు | 44 | కీరా దోస | 40 |
| బీరకాయలు | 18 | ఫ్రెంచ్‌బీన్స్ | 84 |
| బీరకాయలు (పందిరి) | 32 | అల్లం | 220 |
| క్యాబేజీ | 20 | కొత్తిమీర (కట్ట) | 25 |
| క్యారెట్ | 34 | పాలకూర | 10 |
| దొండకాయలు | 14 | చుక్కకూర | 10 |
| బంగాళదుంపలు | 22 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 18 | గోంగూర | 06 |
| గోరుచిక్కుడు | 42 | పుదీనా | 05 |
| దోసకాయలు | 12 | బఠాణీ | -- |
| ఆనబకాయ (1) | 10-15 | క్యాప్సికమ్ | 74 |
| పొట్లకాయ(1) | 15 | చిలకడదుంప | 36 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర) | 21.00 | 01 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర) | 21.00 | 01 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 05 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 13 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 02 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 01 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 01 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4804 | 01 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 00 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 22.15 | 34820 | 03 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 09.00 | 4794 | 36 |
| ఏలూరు - విశాఖపట్నం | 12.00 | 4840 | 36 |
| ఏలూరు -విశాఖపట్నం | 22.00 | 4838 | 28 |
| ఏలూరు -తిరుపతి | 16.00 | 4830 | 21 |

### పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న కళాకారుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని, సమాజంలోని పౌరులంతా వ్యక్తిగతంగా పర్యావరణ ప్రేమికులుగా మారితే పర్యావరణంలో సమూల మార్పు తీసుకురావచ్చని కళాజాతా బృందం సభ్యులు తిరుపతి కుమార్, వీర్నాల రమేష్ పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ నెల 5 వరకు జిల్లా వ్యాప్తంగా కళా ప్రదర్శనల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. శనివారం తంగెళ్లమూడిలో కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. జాతాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కలిగించారు.

# నకిలీ పట్టాలపై చర్యలు శూన్యం



ఫిర్యాదు పత్రం చూపిస్తున్న వేగి వీరబాపూజీ, కోటేశ్వరరావు

దెందులూరు : మండలంలోని పోతునూరులో తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి గ్రామ రెవెన్యూ అధికారి పట్టాలిచ్చారని ఆరోపిస్తూ పలువురు కలెక్టర్, ఆర్డీవోకు, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారులు వేగి వీర బాపూజీ, కోటేశ్వరరావు మాట్లాడుతూ పోతునూరుకి చెందిన ఆడారి కనక వరవిజయలక్ష్మికి నాలుగు ఎకరాలకు సంబంధించిన పట్టాను పొలం లేకపోయినా తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి, గ్రామ రెవెన్యూ అధికారి నకిలీ పట్టాను అందించారని వారు ఆరోపించారు. దీనిపై అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని వారు శనివారం విలేకరుల సమావేశం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1996లో దెందులూరు తహసీల్దార్‌గా పనిచేసిన డి వెంకట్రావు పేరున రూపొందించిన స్టాంపును వేసి, 2006లో ఆడారి కనక విజయలక్ష్మికి అక్రమంగా పట్టా ఇచ్చారు. 2006లో పనిచేసిన దెందులూరు తహసీల్దార్ సరోజిని పేరు లేకుండా ఏ విధంగా పట్టా ఇస్తారని అధికారులకు ఫిర్యాదు చేసినా దీనిపై ఎవరూ చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారుల స్పందించి పూర్తిస్థాయి విచారణ చేసి నకిలీ పట్టాను రద్దుచేసి, గ్రామ రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకోవాలని వీర బాపూజీ, కోటేశ్వరరావు కోరారు. ఆరోపణలు అబద్ధమని తేలితే మాపై తీసుకునే ఏ చర్యకైనా సిద్ధమని వారన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగ చోరీ

పెదపాడు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగ చోరీపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని కొక్కిరపాడు గ్రామ పంచాయతీ పరిధిలో గోళ్ల మహేష్‌కు చెందిన పంట పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ అపహరించారు. దీంతో పెదపాడు విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు: మండలంలోని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకంలో భాగంగా పెదపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాళ్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెదపాడు ఐసీడీఎస్ సీడీపీవో కే విజయలక్ష్మి తెలిపారు. పెదపాడు ప్రాజెక్టు పరిధిలోని పెదవేగి మండలం కూచింపూడి ఓసీ, కొండలరావుపాలెం ఎస్ పెదపాడు-9, బీసీ-ఈ నాయుడుగూడెం బీసీ-డీ, జాలిపూడి-2 ఓసీ, మల్కాపురం-2 బీసీఏ అభ్యర్థులకు కేటాయించినట్లు చెప్పారు. 21 ఏళ్ల నిండి 35 సంవత్సరాలు లోపు వయస్సున్న పదో తరగతి పాసైన స్థానికులైన వివాహిత మహిళలు జూన్ నెల 2లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# సీఎం జగన్ సంక్షేమ పాలనకు ప్రజాదరణ



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ప్రతి గడపలో కుటుంబ సభ్యులందరి చిరునవ్వు, సంతృప్తి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తూ ప్రజా దరణ పొందారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని చెప్పారు. శనివారం గాలాయగూడెంలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైద్యం, ఇంటి స్థలం, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, రుణాలు, ఇతర సమస్యలకు సంబంధించి వినతులను ఎమ్మెల్యే వివరించారు.

**అభివృద్ధి, సంక్షేమం విస్మరించిన టీడీపీ**

టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదల అభివృద్ధి, సంక్షేమం విస్మరించారని ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఆరోపించారు. దీంతో ప్రజల జీవనవిధానం దుర్భరంగా మారిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకు భిన్నంగా పేదలు నివసించేందుకు స్థలం పట్టా, ఇంటి నిర్మాణానికి రుణం పారదర్శకంగా అందజేశారన్నారు. నాలుగేళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిక, ఆలోచనా విధానం, ఇచ్చిన హామీలు అమలు చేయడంతో ప్రజలందరూ మరోసారి సీఎంగా కావాలని కోరుకుంటున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి పథకాలు, విప్లవాత్మకంగా సత్ఫలితాలు ఇవ్వడంతో టీడీపీ నాయకులు ఏ రోజు ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదన్నారు.

**అంకితభావంతో కృషి చేయాలి**

వైఎస్సార్‌సీపీ అజెండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలు తారతామ్యం లేకుండా అందజేయడం, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ తరహాలో పెద్ద ఎత్తున ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి అహర్నిశలు బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి శ్రమిస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. స్పందన, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల ఉద్యోగులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎంసీ ఛైర్మన్ అప్పన ప్రసాద్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మేకా లక్ష్మణరావు, సానిగూడెం సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ తదితరులు ఉన్నారు.